అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 334 | వరంగల్ | బుధవారం, 14 అక్టోబర్ 2026 | పేజీలు: 06



3ట్రిలియన్ డాలర్లు

ఆర్థిక శక్తిగా తెలంగాణ

ఇదే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాం

- యువత, మహిళలే పారిశ్రామిక ప్రగతికి చోదకశక్తులు
- స్టార్టప్‌లకు 'ఫ్యూర్'లో అపార అవకాశాలు
- ఓఆర్ఆర్ బయట పరిశ్రమల విస్తరణకు ప్రణాళిక
- కాలుష్య పరిశ్రమల తరలింపునకు హిల్ట్ పాలసీ
- 2047 నాటికి తెలంగాణను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతాం
- గ్లోబల్ బిజినెస్ సమ్మిట్–2026లో సీఎం రేవంత్‌రెడ్డి

5

యువత, మహిళలకు పారిశ్రామిక రంగంలో సముచిత ప్రాధాన్యమిస్తూ తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని, వాటి అమలుకు పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున పెట్టుబడులతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) మధ్యనున్న పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (ఫ్యూర్) పరిధిని తయారీ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాంతంలో యువ పారిశ్రామికవేత్తలు స్టార్టప్‌లు, నూతన పరిశ్రమలు స్థాపించి అద్భుతమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రపంచంతో పోటీపడే స్థాయికి హైదరాబాద్‌ను తీసుకెళ్లడంతోపాటు మహిళల పారిశ్రామిక భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని స్పష్టం చేశారు. హైదరాబాద్ హైటెక్స్‌లో సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ బిజినెస్ సమ్మిట్–2026 ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. యువతకు ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న ఆర్థిక, పారిశ్రామిక మార్పులు, నూతన విధానాలు, చట్టాలపై అవగాహన కల్పించడంలో ఇలాంటి సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనుభవజ్ఞుల ఆలోచనలు, అనుభవాల నుంచి నేర్చుకుంటూ యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా సొంతంగా పరిశ్రమలు స్థాపించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. - అక్షరశక్తి, హైదరాబాద్





విద్యుత్ కోతలతో రైతుల అవస్థలు

- వెంకటాపూర్ సబ్‌స్టేషన్ ముట్టడి..
- పాలంపేట–పరకాల రహదారిపై బీఆర్ఎస్ ధర్నా

అకాల విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం వెంకటాపూర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు.

3

హనుమకొండ కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబరాలు.. ఆడిపాడిన మహిళా ఉద్యోగులు





5



రెగ్యులరైజేషన్ చేసే వరకు సమ్మె విరమించేది లేదు

- రెండో రోజూ కొనసాగిన ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె
- 33 జిల్లాల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన..
- బతుకమ్మ ఆడుతూ ఆందోళన

4

కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా వేతనాలు చెల్లించాలి: ఆర్. కృష్ణయ్య

అక్షరశక్తి.కేయూ క్యాంపస్: విశ్వవిద్యాలయాల్లో గత 20 నుంచి 30 ఏళ్లుగా సేవలందిస్తున్న సుమారు 1,200 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధ్యాపకులను విస్మరించి కొత్త నియామకాలు చేపడితే వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేసి, కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సులు, ఐఏఎస్ అధికారి మురళి కమిటీ మార్గదర్శకాల ఆధారంగా అర్హులైన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించిన తర్వాతే కొత్త నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి



అక్షరశక్తి.హనుమకొండ: ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవలు అమూల్యమైనవని, వారు అందిస్తున్న వైద్య సేవలు ప్రజలకు అత్యంత అవసరమైనవని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ కే. వీరస్వామి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి ప్రసంగించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. సమ్మెలో ఉన్న ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకొని, ప్రజలకు నిత్యం అవసరమైన వైద్య సేవలను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

వేడిని తట్టుకునే టమాటా అభివృద్ధిపై పరిశోధనాత్మక పుస్తకం

పరిశోధకులను అభినందించిన కేయూ వీసీ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి



అక్షరశక్తి, కేయూ క్యాంపస్(హనుమకొండ), అక్టోబరు 14: అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే టమాటా రకాల అభివృద్ధిపై రూపొందించిన పరిశోధనాత్మక పుస్తకాన్ని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కేయూ బయోటెక్నాలజీ విభాగ విశ్రాంత ఆచార్యుడు ఎన్. రామస్వామి నేతృత్వంలో పరిశోధకులు డాక్టర్ విక్రం గొడిశాల, డాక్టర్ రజనీకాంత్ మరక రచించిన హీట్ టాలరెంట్ ట్రాన్స్‌జెనిక్ కల్టివేటెడ్ టమాటో పుస్తకాన్ని వీసీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే టమాటా రకాల అభివృద్ధికి సంబంధించిన పరిశోధనలు అభినందనీయమన్నారు. ఈ సాంకేతికతతో రైతులు తమ అవసరాలకు అనుగుణంగా నాట్ల తేదీలను మార్చుకోవచ్చని, అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రస్తుతం సాగుకు అనుకూలంగా లేని ప్రాంతాల్లో నూ టమాటా పంట సాగు చేసే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. పుస్తక రచయిత ఆచార్య ఎన్. రామస్వామి మాట్లాడుతూ.. వేడిని తట్టుకునే పంటల అభివృద్ధికి ఉపయోగించిన సాంకేతికతను వేడికి సున్నితమైన ఇతర కూరగాయలు, వరి వంటి పంటలకు కూడా అన్వయించే అవకాశం ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే పంటల అభివృద్ధికి ఈ పరిశోధనలు ప్రాధాన్యం సంతరించుకుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఓఎస్డీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, డాక్టర్ బి. రమ, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పి. శ్రీనివాస్, డాక్టర్ టి. శాస్త్రి, డాక్టర్ లక్ష్మణ్, వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. శేషాచలం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. హరేందర్‌రెడ్డి, డాక్టర్ జి. రాజప్రసాద్, డాక్టర్ బాలరాజు, డాక్టర్ కే. హిమబిందు, డాక్టర్ పి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జనగణన పకడ్బందీగా నిర్వహించాలి

- వివరాల నమోదులో ఖచ్చితత్వం పాటించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్



అక్షరశక్తి, ములుగు: జనగణన-2027 రెండో దశ జనాభా గణనను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది తమ విధులపై పూర్తి అవగాహన పెంచుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ సూచించారు. జనగణన విధుల్లో భాగంగా ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు అక్టోబర్ 13, 14 తేదీల్లో ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెండు రోజుల శిక్షణ నిర్వహించారు. బుధవారం నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక శిక్షణను సద్వినియోగం చేసుకొని, జనగణన వివరాల నమోదులో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గతంలో కాగితాలపై నమోదు చేసిన జనగణన వివరాలను ఈసారి ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా సేకరించనున్నందున సంబంధిత సాంకేతిక అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జనగణన నిర్వహణ, పర్యవేక్షణకు ఉపయోగించే సీఎంఎంఎస్ పోర్టల్‌పై సిబ్బంది పూర్తి అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత వివరాలను సీఎంఎంఎస్ పోర్టల్‌లో తప్పులు లేకుండా ఖచ్చితత్వంతో నమోదు చేయాలని తెలిపారు. రెండో దశ జనాభా గణనలో అడగనున్న 40 ప్రశ్నలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిక్షణ సమయంలో సందేహాలను నివృత్తి చేసుకొని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ శిక్షణలో హైదరాబాద్‌లోని జనగణన కార్యకలాపాల సంచాలకుల కార్యాలయం నుంచి విచ్చేసిన సాంకేతిక అధికారి ఏ.ఆర్. యువేందర్ బాబు, జనగణన అధికారి, ప్రధాన శిక్షకుడు సి.హెచ్. నాయుడు ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పర్యవేక్షకురాలు మంజుల, ములుగు ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయ గణాంక అధికారి భూక్య లాల్ నాయక్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



అక్షరశక్తి.వరంగల్: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర ఎన్‌హెచ్‌ఎం జేవీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి. భరత్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ సెంటర్‌లో జిల్లా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సమ్మె కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ భరత్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో సుమారు 17 వేల మంది ఉద్యోగులు ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకుండా వెట్టిచాకిరీ చేయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల నుంచి వైద్యుల వరకు అందరినీ నిబంధనల ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం పరిధిలోని 78 కాడర్ల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, పీఆర్సీ ప్రకారం న్యాయమైన వేతనాలు, గ్రాస్ శాలరీ, వార్షిక ఇంక్రిమెంట్లు, రాయల్టీ బోనస్, ఆరోగ్య బీమా, ఇతర సంక్షేమ ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వివిధ క్యాడర్ల మధ్య ఉన్న వేతన వ్యత్యాసాలను న్యాయబద్ధంగా సమీక్షించి, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల ఆవేదనను అర్థం చేసుకొని, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీందర్, నితిన్ రెడ్డి, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ మోహన్ రావు, డాక్టర్ మధు, డాక్టర్ యశస్విని, డాక్టర్ రమ్య, డైట్ మేనేజర్ అనిల్, వీసీ సీఎం రవీందర్, డీఏఓ సునీత, సంఘ అనిల్ కుమార్, అంజి, నర్మద, జ్యోతి, గీత, వైకుంఠం తదితర ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

రీ-సర్వేపై అపోహలు వీడండి

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



అక్షరశక్తి.వరంగల్: పర్వతగిరి మండలం గోపనపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన భూముల రీసర్వే అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని, రీసర్వేపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూముల రీసర్వే ప్రక్రియ ద్వారా భూముల సరిహద్దులు, విస్తీర్ణం, భూ రికార్డుల కోసం వివరాల్లో స్పష్టత, పారదర్శకత పెరుగుతాయని తెలిపారు. రీసర్వేపై ఎలాంటి అపోహలకు గురికాకుండా రైతులు, భూయజమానులు ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, రికార్డుల్లో ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసరావు, వరంగల్ ఆర్డీవో సుమ, పర్వతగిరి తహసిల్దార్ వెంకటస్వామి, గోపనపల్లి సర్పంచ్ నాంపల్లి విజయ, అనంతరం సర్పంచ్ తోట శ్రీలత, సంబంధిత అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో రైతుల అవస్థలు

- వెంకటాపూర్ సబ్‌స్టేషన్ ముట్టడి..
- పాలంపేట–పరకాల రహదారిపై బీఆర్ఎస్ ధర్నా



అక్షరశక్తి, ములుగు(వెంకటాపూర్), అక్టోబరు 14: అకాల విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం వెంకటాపూర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, సీనియర్ నాయకుడు మల్క రమేష్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ముందుగా పాలంపేట-పరకాల రహదారిపై సుమారు గంటపాటు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం సబ్‌స్టేషన్ గేట్లు ఎక్కి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగాల రమణారెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో గంటల తరబడి కోతలు విధిస్తున్నారని విమర్శించారు. సీనియర్ నాయకుడు మల్క రమేష్ మాట్లాడుతూ.. వరి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని, మోటార్లు కాలిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించక పోతే మండలవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గై అశోక్, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రావు, కాసర్ల కుమారస్వామి, సర్పంచ్ బొజ్జ జగన్మోహన్‌రావు, బీఆర్ఎస్ మీడియా మండల కన్వీనర్ మునిగంటి నరేంద్రచారి, ఉప సర్పంచ్‌లు చింతం ప్రకాష్, బీట్ల తిరుపతి, యువజన నాయకులు మోడిగ రాజ్‌కుమార్, దిలీప్‌కుమార్, అంతటి రాము, గొడుగుల వెంకటేష్, కామా అశోక్, ఎండీ సజీరుల్లా, సిలువేరు కార్తీక్, బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చంటి భద్రయ్య, తండ రమేష్, పోశాల వీరమల్లు, జనగాం రవి, జహీర్‌పాషా, సాద యాదగిరి, నూనె రమేష్, చింతిరెడ్డి అనోజ్‌రెడ్డి, వీరబోయిన సాంబయ్య, బోయిని సదయ్య, సదాటి సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

- రాజ్యాంగ పరిరక్షణకు సైనికులా పనిచేయాలి: చుంచు రాజేందర్



అక్షరశక్తి, హసన్‌పర్తి, అక్టోబరు 14: కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. భారత్‌కు బౌద్ధమే శరణ్యమని, యువత బౌద్ధ మార్గాన్ని అనుసరించాలని అన్నారు.
డీబీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో 70వ ధమ్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని నిర్వహించారు. హనుమకొండలోని బుద్ధుడి విగ్రహానికి పూలు సమర్పించడంతోపాటు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేడ్కర్ 1956 అక్టోబరు 14న నాగ్‌పూర్‌లోని దీక్షాభూమిలో తన సహచరి సవితా అంబేడ్కర్‌తోపాటు లక్షలాది మంది అనుచరులతో బౌద్ధాన్ని స్వీకరించారని గుర్తు చేశారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజ్ఞ, కరుణ బౌద్ధ ధమ్మ మార్గంలోని ప్రధాన విలువలని పేర్కొన్నారు. ప్రతి మనిషికి సమాన హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం అందించడమే అంబేడ్కర్ ఆశయమన్నారు. రాజ్యాంగం ద్వారా లభించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలంటూ కొందరు చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని, రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా దళితులపై కుల వివక్ష కొనసాగుతుండటం ఆందోళనకరమని, కులవ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని అన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చుంచు నరేష్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకుడు సందెల రవీందర్ చిన్న, డీబీఎఫ్ జిల్లా నాయకుడు చుంచు రాజు, రజక సంఘం జిల్లా నాయకుడు పోలేపల్లి సదానందం, బీసీ పద్మశాలి సంఘం జిల్లా నాయకుడు గాడిపల్లి సతీష్, డీబీఎఫ్ నాయకులు సుందరయ్య, డాక్టర్ రాజారాం, భరత్, రాజు, సింగారపు మహేష్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేశాకే

కొత్త నియామకాలు చేపట్టాలి

- కేయూ పరిపాలనా భవనం ఎదుట కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ధర్నా





అక్షరశక్తి, కేయూ క్యాంపస్(హనుమకొండ), అక్టోబరు 14: కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేసిన తర్వాతే కొత్త నియామకాలు చేపట్టాలని కాకతీయ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నంబర్ 31లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు సంబంధించిన విధివిధానాలను ప్రకటించిన నేపథ్యంలో బుధవారం కేయూ పరిపాలనా భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. 20 నుంచి 30 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, యూజీసీ పే స్కేళ్లు అమలు చేయాలని, రెగ్యులరైజేషన్ చేపట్టిన తర్వాతే కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. అనంతరం కేయూ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డిని కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపక సంఘం ప్రతినిధులు డాక్టర్ పి. కర్ణాకర్‌రావు, డాక్టర్ మాదాసి కనకయ్య, డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోత్, డాక్టర్ డి. భిక్షపతి, డాక్టర్ టి. ఆశీర్వాదం, డాక్టర్ ప్రణీత, డాక్టర్ ఈ. రాజేశ్వరి, డాక్టర్ ఆర్.డి. ప్రసాద్, డాక్టర్ ఆరూరి సూర్యం, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ తూర్పాటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 50 మంది అధ్యాపకులు ధర్నాలో పాల్గొన్నారు.

చీకట్లోనే నెల్లికుదురు బస్టాండ్!

- మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్లు కరువు.. పేరు బోర్డూ లేదు
- అధికారులు స్పందించకుంటే ఆందోళన
- బీఆర్ఎస్ యువ నాయకుడు వరిపల్లి అనిల్‌కుమార్



అక్షరశక్తి, నెల్లికుదురు: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా యువ నాయకుడు వరిపల్లి అనిల్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు లేక పోవడంతో ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బస్టాండ్‌కు సరైన పేరు బోర్డు కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఆదేశాల మేరకు బస్టాండ్‌ను సందర్శించిన ఆయన, ప్రయాణికుల ఇబ్బందులను పరిశీలించారు. వెంటనే మరుగుదొడ్లను పునరుద్ధరించాలని, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని అధికారులను డిమాండ్ చేశారు. ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని అన్నారు. సమస్యలపై స్పందించి బస్టాండ్‌ను అభివృద్ధి చేయకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని వరిపల్లి అనిల్‌కుమార్ హెచ్చరించారు.

సద్దుల బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- మహిళలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి..
- అధికారులకు ఎమ్మెల్యే రేవూరి ఆదేశం



అక్షరశక్తి, పరకాల: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు, ఆడపడుచులు ఆనందోత్సాహాల మధ్య ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ఏర్పాట్లు చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పరకాల పట్టణంలోని గొడ్ల అంగడి మైదానంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. వేడుకలకు హాజరయ్యే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మహిళా సోదరీమణులకు స్వాగతం పలికేలా హోర్డింగులు ఏర్పాటు చేయాలని, మైదానంలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం దామెర చెరువు వద్ద బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలు సజావుగా జరిగేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు.

భద్రకాళి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా కల్లూరి పవన్



అక్షరశక్తి, హనుమకొండ: వరంగల్ శ్రీ భద్రకాళి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నియమితులైన గంగపుత్ర సామాజిక వర్గ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు కల్లూరి పవన్ గంగపుత్రను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర అభినందించారు. ఈ నియామకానికి సహకరించిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. భద్రకాళి దేవస్థానం అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పవన్ గంగపుత్ర కృషి చేయాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

అంతిమ విజయం వర్గపోరాటానిదే

బీసీ హక్కుల సాధన సమితి సభ్యత్వ నమోదు



అక్షరశక్తి, హసన్‌పర్తి, అక్టోబరు 14: శ్రామిక వర్గంపై దోపిడీ, పీడన, వివక్షను నిర్మూలించి సమానత్వ సమాజాన్ని నిర్మించేందుకు వర్గ, వర్ణ రహిత పోరాటాలు నిర్వహించాలని సీపీఐ సీనియర్ నాయకుడు మోతె లింగారెడ్డి, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి పిలుపునిచ్చారు. బుధవారం హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో మండల సీపీఐ కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి అధ్యక్షతన బీసీ హక్కుల సాధన సమితి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలకవర్గాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ, భూస్వామ్య విధానాల వల్ల శ్రామిక వర్గం దోపిడీకి గురవుతోందని విమర్శించారు. వెనుకబడిన తరగతులు, మహిళలు, రైతులు, కూలీల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు అవసరమన్నారు. బహుజనులకు తగిన వాటా, ఆత్మగౌరవం, అధికారం దక్కాలంటే వర్గ, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. శ్రమదోపిడీ నుంచి విముక్తి సాధించి సమానత్వ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం అసంపర్తి మండల బీసీ హక్కుల సాధన సమితి కన్వీనర్‌గా నాంపల్లి లక్ష్మయ్యను, కోకన్వీనర్లుగా గోపరాజు కుమారస్వామి, నేదునూరి కుమారస్వామి, గోపనబోయిన రాజయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం హనుమకొండ జిల్లా కార్యదర్శి దొమ్మాటి ప్రవీణ్‌కుమార్, షేక్ బాబు, నాంపల్లి లక్ష్మయ్య, దుస్స నేదునూరి కుమారస్వామి, నేదునూరి రవికుమార్, తోట దామోదర్, నేదునూరి లక్ష్మీనారాయణ, దుస్స వెంకటేశ్వర్లు, మెట్టు జక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వేరో ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



అక్షరశక్తి, హసన్‌పర్తి, అక్టోబరు 14: స్వేరో ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ చాతల్ల వేణుగోపాల్ పిలుపునిచ్చారు. బుధవారం హసన్‌పర్తి మండల కేంద్రంలో నిర్వహించిన స్వేరో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మేళన నిర్వహణలో భాగంగా నవంబరు 15న హరిత కాకతీయ హోటల్‌లో బూట్ క్యాడర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్వేరో ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు, సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ (ఐపీఎస్, అదనపు డీజీపీ హోదా నుంచి వీఆర్ఎస్) ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. ప్రతి స్వేరో కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ స్టీరింగ్ కమిటీ సభ్యులు మేకల అభినేష్, ఊరిబిండి ఓంకార్ యాదవ్, మెరుగు కృష్ణగౌడ్, హసన్‌పర్తి మండల కన్వీనర్ మేకల సిద్ధు, కోకన్వీనర్ తగరం రతన్, పంగ అఖిల్, మంద వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

పరకాల ఎమ్మెల్యే రేవూరి



అక్షరశక్తి, నడికూడ: హన్మకొండ జిల్లా నడికూడ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ), మహిళా సమైక్య భవనాలను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. భవనాల నిర్మాణ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నడికూడ మండలంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నూతన పీహెచ్‌సీ భవనం ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మహిళా సమైక్య భవనాలను పరిశీలించి, వాటి వినియోగానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

రెగ్యులరైజేషన్ చేసే వరకు సమ్మె విరమించేది లేదు

- రెండో రోజూ కొనసాగిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె
- 33 జిల్లాల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన..
- బతుకమ్మ ఆడుతూ ఆందోళన



అక్షరశక్తి, హైదరాబాద్, అక్టోబరు 14: ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్, వేతన సంబంధిత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజూ కొనసాగింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో వివిధ కేడర్లకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బతుకమ్మ ఆడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రజారోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న సుమారు 17 వేల మంది ఉద్యోగులు, 78 కేడర్ల సిబ్బంది తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఉద్యమిస్తున్నారని ఎన్‌హెచ్‌ఎం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) తెలిపింది. ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్ తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసింది.

వైద్య సేవలకు అంతరాయం

సమ్మె కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని జేఏసీ కోరింది. ప్రజారోగ్య సేవలకు ఆటంకం కలగకుండా ఉద్యోగుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని విజ్ఞప్తి చేసింది. కొన్ని జిల్లాల్లో సమ్మెలో పాల్గొంటున్న ఉద్యోగులపై అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు (డీఎంహెచ్‌వోలు) ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని జేఏసీ పేర్కొంది. ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసే చర్యలను నిలిపివేసి, వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరింది.

చర్చలకు పిలవాలి

ప్రభుత్వం వెంటనే ఎన్‌హెచ్‌ఎం జేఏసీ రాష్ట్ర నాయకత్వాన్ని చర్చలకు ఆహ్వానించి, ఉద్యోగుల డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఎన్‌హెచ్‌ఎం జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మహేందర్‌రావు పుట్ట డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్‌తోపాటు ఉద్యోగ భద్రత, వేతన సంబంధిత సమస్యలు, ఇతర ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి హామీ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం చర్చలు జరిపి, డిమాండ్ల పరిష్కారానికి స్పష్టమైన చర్యలు తీసుకునే వరకు నిరవధిక సమ్మెను విరమించే ప్రసక్తే లేదని జేఏసీ స్పష్టం చేసింది. ఈ ఉద్యమం ఏ ఒక్క జిల్లాకో, కేడర్‌కో పరిమితమైనది కాదని, 33 జిల్లాల్లోని అన్ని కేడర్ల ఉద్యోగుల హక్కుల కోసం జరుగుతున్న ఐక్య పోరాటమని పేర్కొంది.

కేయూలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- తెలంగాణ ఆడపడుచుల సాంస్కృతిక పండుగ: వీసీ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి



అక్షరశక్తి, కేయూ క్యాంపస్(హనుమకొండ), అక్టోబరు 14: బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల పండుగ అని, ప్రకృతితో మమేకమై సంప్రదాయాలను చాటిచెప్పే ఈ వేడుక సమాజాన్ని ఐక్యం చేస్తుందని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూ మహిళా బోధనా, బోధనేతర ఉద్యోగుల ఆధ్వర్యంలో బుధవారం పరిపాలనా భవన ప్రాంగణంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ప్రకృతిలో లభించే పూలతో బతుకమ్మను అలంకరించి, పండుగ అనంతరం వాటిని తిరిగి ప్రకృతికే సమర్పించడం ఈ వేడుక ప్రత్యేకతని అన్నారు. వివిధ ప్రాంతాల్లో నివసించే ఆడపడుచులు స్వస్థలాలకు చేరుకుని కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి పండుగ జరుపుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. పాలకమండలి సభ్యురాలు డాక్టర్ రమ మాట్లాడుతూ.. ప్రకృతిలో కాలానుగుణంగా వచ్చే మార్పులను స్వాగతిస్తూ బతుకమ్మను జరుపుకుంటారని తెలిపారు. మరో సభ్యురాలు కే. అనితారెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ ప్రజలందరినీ ఐక్యం చేసే సాంస్కృతిక వేడుకని అన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ఆచార్య సురేష్‌లాల్, డాక్టర్ ఎన్. సుదర్శన్, డాక్టర్ చిర్రా రాజు, అధికారుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ ఎస్. సుజాత, నాన్ టీచింగ్ మహిళా ఉద్యోగుల ప్రతినిధి బి. కృష్ణవేణి, నాలుగో తరగతి మహిళా ఉద్యోగుల ప్రతినిధి జి. మల్లికాంబ, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ముకుందారెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు, బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి పూజలు నిర్వహించారు. పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు.

కాజీపేటకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కాంగ్రెస్ నేతల కృతజ్ఞతలు



అక్షరశక్తి, హనుమకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేటకు సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని బుధవారం కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. కాజీపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమన్నారు. పాఠశాల ఏర్పాటుతో పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో కాజీపేట ప్రాంతంలో విద్యారంగం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమన్నారు. సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపట్టడం ఈ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తుకు ప్రయోజనకరమని తెలిపారు. కాజీపేట అభివృద్ధితోపాటు ప్రజల అవసరాలను గుర్తించి విద్యారంగానికి ప్రాధాన్యమిస్తూ పాఠశాల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కాజీపేట ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అంకుష్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పసునూరి మనోహర్, మాజీ కార్పొరేటర్ అబుబకర్, విజయశ్రీ రజాలి, సుంచు అశోక్, ఎన్ఎస్‌యూఐ మాజీ జాతీయ కోఆర్డినేటర్ రహమతుల్లా మహమ్మద్, 62వ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల ఆంజనేయులు, బుర్ర బాబురావు తదితరులు పాల్గొన్నారు.

3ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ

- ఇదే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాం
- యువత, మహిళలే పారిశ్రామిక ప్రగతికి చోదకశక్తులు
- స్టార్టప్‌లకు 'ఫ్యూర్'లో అపార అవకాశాలు
- ఓఆర్ఆర్ బయట పరిశ్రమల విస్తరణకు ప్రణాళిక
- కాలుష్య పరిశ్రమల తరలింపునకు హిల్ట్ పాలసీ
- 2047 నాటికి తెలంగాణను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతాం
- గ్లోబల్ బిజినెస్ సమ్మిట్–2026లో సీఎం రేవంత్‌రెడ్డి





అక్షరశక్తి, హైదరాబాద్, అక్టోబరు 14: యువత, మహిళలకు పారిశ్రామిక రంగంలో సముచిత ప్రాధాన్యమిస్తూ తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని, వాటి అమలుకు పారిశ్రామిక వేత్తలు పెద్ద ఎత్తున పెట్టుబడులతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) మధ్యనున్న పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (ఫ్యూర్) పరిధిని తయారీ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాంతంలో యువ పారిశ్రామికవేత్తలు స్టార్టప్‌లు, నూతన పరిశ్రమలు స్థాపించి అద్భుతమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రపంచంతో పోటీపడే స్థాయికి హైదరాబాద్‌ను తీసుకెళ్లడంతోపాటు మహిళల పారిశ్రామిక భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని స్పష్టం చేశారు. హైదరాబాద్ హైటెక్స్‌లో సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ బిజినెస్ సమ్మిట్-2026 ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. యువతకు ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న ఆర్థిక, పారిశ్రామిక మార్పులు, నూతన విధానాలు, చట్టాలపై అవగాహన కల్పించడంలో ఇలాంటి సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనుభవజ్ఞుల ఆలోచనలు, అనుభవాల నుంచి నేర్చుకుంటూ యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా సొంతంగా పరిశ్రమలు స్థాపించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

మూడు ప్రాంతాలు.. మూడు ఆర్థిక వ్యూహాలు

తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రాంతీయ వనరులు, భౌగోళిక పరిస్థితులు, జనాభాకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించినట్లు సీఎం తెలిపారు. 2025లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్-2047 గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించి, తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

రాష్ట్రాన్ని మూడు ప్రాంతీయ ఆర్థిక విభాగాలుగా విభజించి, ఒక్కో ప్రాంతానికి ప్రత్యేక అభివృద్ధి వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు వివరించారు.

కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్):

ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని సుమారు 2,100 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో 1.34 కోట్ల జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్యూర్‌ను గుర్తించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో సేవారంగానికి ప్రాధాన్యమిస్తూ, కాలుష్యకారక పరిశ్రమలను నగరానికి వెలుపలికి తరలించాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు.

పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (ఫ్యూర్):

ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్యనున్న సుమారు 10,500 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని తయారీ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. స్టార్టప్‌లు, నూతన పరిశ్రమల స్థాపనకు ఈ ప్రాంతం యువ పారిశ్రామికవేత్తలకు విస్తృత అవకాశాలను అందిస్తుందని పేర్కొన్నారు.

రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (రేర్):

రీజినల్ రింగ్ రోడ్డు నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్న సుమారు లక్ష చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని వ్యవసాయ ఆధారిత ఆర్థిక కార్యకలాపాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

కాలుష్య పరిశ్రమల తరలింపునకు హిల్ట్ పాలసీ

హైదరాబాద్ అభివృద్ధిలో ఔటర్ రింగ్ రోడ్డు కీలక పాత్ర పోషించిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మెరుగైన రవాణా అనుసంధానంతో ఐటీ, ఫార్మా, విద్య, సేవారంగాలు విస్తరించి నగరం నాలెడ్జ్ హబ్‌గా ఎదిగిందని వివరించారు. ఇదే తరహాలో ఓఆర్ఆర్‌కు వెలుపల సుమారు 50 కిలోమీటర్ల పరిధిలో 360 కిలోమీటర్ల మేర రీజినల్ రింగ్ రోడ్డును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని కాలుష్యకారక పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన రాయితీలు, అనుమతులు, ఇతర సహకారం అందించాలన్న ఉద్దేశంతో హిల్ట్ పాలసీని తీసుకొచ్చినట్లు వివరించారు. పరిశ్రమల తరలింపు ప్రక్రియలో పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని భరోసా ఇచ్చారు. నగరంలో సేవారంగం అభివృద్ధి చెందడంతోపాటు, వెలుపలి ప్రాంతాల్లో తయారీ పరిశ్రమలకు అవకాశాలు పెరగడం ద్వారా సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉద్యోగులుగా కాదు.. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ప్రపంచ ప్రఖ్యాత కార్పొరేట్ సంస్థల్లో భారతీయులు ఉన్నత స్థానాల్లో పనిచేస్తున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అయితే, అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడానికే పరిమితం కాకుండా సొంతంగా స్టార్టప్‌లు స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని యువతకు సూచించారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సాంకేతిక మార్పులు, నూతన పారిశ్రామిక విధానాలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విధానాలకే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న మార్పులను కూడా యువత అధ్యయనం చేయాలని అన్నారు. వివిధ రంగాల నిపుణులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి వారి అనుభవాలను పంచుకునే అవకాశాన్ని సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ కల్పిస్తోందని అభినందించారు. తమ ఆలోచనలను యువతకు అందించి, వారిని అభివృద్ధి దిశగా నడిపించాలన్న సంస్థ లక్ష్యం ప్రశంసనీయమని పేర్కొన్నారు.

మహిళల భాగస్వామ్యంతోనే సమగ్ర ప్రగతి

పారిశ్రామికాభివృద్ధిలో మహిళలకు సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా మహిళల భాగస్వామ్యం పెరిగిన దేశాలు ఆర్థికంగా పురోగమిస్తున్నాయని పేర్కొన్నారు. భారతదేశంలోనూ మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య పెరగాలని ఆకాంక్షించారు. మహిళలు వ్యాపారాలు, పరిశ్రమల స్థాపనలో ముందుకు వచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం పలు పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. యువత, మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా పారిశ్రామిక రంగంలో రాష్ట్రం మరింత పురోగతి సాధిస్తుందని అన్నారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని కల్పించడంతోపాటు పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు.

2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం

భారతదేశానికి 2047 అత్యంత కీలకమైన సంవత్సరమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే నాటికి దేశం సాధించిన ప్రగతిని సమీక్షించుకోవడంతోపాటు, భవిష్యత్ లక్ష్యాలను సాధించేందుకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. భారత్‌ను 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు రావాలని సూచించారు. అదే సమయంలో తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలంటే ప్రణాళికలతోపాటు వాటి అమలు, పెట్టుబడులు కీలకమని అన్నారు. పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోని ప్రముఖ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్‌ను తీసుకెళ్లడమే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె. రఘురామ కృష్ణరాజు, ఎంపీలు డాక్టర్ కె. లక్ష్మణ్, వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబరాలు.. ఆడిపాడిన మహిళా ఉద్యోగులు









అక్షరశక్తి,హనుమకొండ: హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మవేడుకలు ఘనంగా నిర్వహించారు. టీఎన్జీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి సంప్రదాయ పాటలు పాడుతూ ఆడిపాడారు. దీంతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్ మహిళా ఉద్యోగులు రూపొందించిన బతుకమ్మలను పరిశీలించి, వాటి అందాన్ని ప్రశంసించారు. బతుకమ్మలను ఎంతో అందంగా, ఆకర్షణీయంగా తయారు చేశారని అభినందించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ సంబరాల్లో పాల్గొని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదును ప్రారంభించిన జనసేన నేతలు

- ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావును గెలిపించాలి
- పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ లయన్ పద్మజాదేవి



అక్షరశక్తి, హనుమకొండ: వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ పరిధి కాజీపేట మండలం కడిపికొండలో జనసేన గ్రేటర్ నాయకురాలు బయ్య పద్మావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ లయన్ పద్మజాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల నుంచి ఓటరు నమోదు దరఖాస్తులను స్వీకరించి నమోదు ప్రక్రియ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... అర్హులైన పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావును గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు గాదె పృథ్వీ, బోళ్ల సరోజన, పెసరు వనిత, బస్కె కృష్ణ, భయ్యా కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి



అక్షరశక్తి, వరంగల్: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన నేరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, సాక్ష్యాధారాల సేకరణ, కోర్టు కేసుల స్థితిగతులపై పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, పరారీలో ఉన్న నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి కేసుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని, నాణ్యతతో కూడిన దర్యాప్తును వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

క్రీడల్లో శిక్షణ ఇప్పించాలి

నగర పోలీస్ కమిషనర్ శ్వేత



అక్షరశక్తి, హనుమకొండ : విద్యార్థి స్థాయి నుంచి పిల్లలకు క్రీడల్లో శిక్షణ ఇప్పించేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శ్వేత కోరారు. ఈనెల 16, 17వ తేదీల్లో నిర్వహించనున్న మినీ సబ్ జూనియర్ బాలుర ఛాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పి. సాంబశివరావు కోరుతూ.. సిపి శ్వేతకు వినతిపత్రం సమర్పించారు. ఈనెల 16, 17వ తేదీల్లో ములుగు రోడ్డులోని ఎల్బీ కళాశాలలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల నుంచి బాలుర జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని వివరించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. సాఫ్ట్ బాల్ క్రీడాభివృద్ధి కోసం కృషి చేస్తున్న అసోసియేషన్ సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ తాబేటి రాజేందర్, ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, క్రీడాకారులు పాల్గొన్నారు.

చేనేత కళకు ప్రోత్సాహం.. సంప్రదాయ వస్త్రాలకు ఆదరణ

హైదరాబాద్‌లో చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం



అక్షరశక్తి, హైదరాబాద్: చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడం, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వినియోగదారులకు నేరుగా ఉత్పత్తులను చేరువ చేయడం, నేతన్నల ఆదాయాన్ని పెంచడమే చేనేత వస్త్ర ప్రదర్శన ప్రధాన ఉద్దేశమని ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ కమిషనర్ ఐఎఎస్ జి. రేఖారాణి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శన (SHE)2026ను బుధవారం ఆమె నందమూరి మోహనరూప, నందమూరి సీమంతినితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రేఖారాణి మాట్లాడుతూ సంప్రదాయ చేనేత కళను పరిరక్షించడంతోపాటు నేత కార్మికుల నైపుణ్యాన్ని ప్రజలకు పరిచయం చేయడం, చేనేత వస్త్రాల ప్రత్యేకతపై అవగాహన పెంచడం ఈ ప్రదర్శన లక్ష్యమన్నారు. యంత్రాలతో తయారయ్యే వస్త్రాల పోటీ నేపథ్యంలో చేనేత ఉత్పత్తులకు ఆదరణ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సంప్రదాయ నేత పద్ధతులతోపాటు ఆధునిక డిజైన్లు, ఆకర్షణీయమైన రంగుల్లో రూపొందించిన వస్త్రాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. చేనేత వస్త్రాల కొనుగోలు ద్వారా నేతన్నల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించవచ్చని నందమూరి మోహనరూప పేర్కొన్నారు. అక్టోబరు 13 నుంచి 26 వరకు కొనసాగే ఈ ప్రదర్శన ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. చేనేతను ఆదరించి నేతన్నలకు అండగా నిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

మహాలక్ష్మి అలంకారంలో భద్రకాళి

- **వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు..**
- **భక్తులను అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**









అక్షరశక్తి, వరంగల్: కాకతీయుల రాజధాని ఏకశిలానగరంగా ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బుధవారం అమ్మవారిని మహాలక్ష్మి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవదుర్గా కల్పోక్త నవరాత్రి పూజా విధానంలో భాగంగా కూష్మాండీ, గిరిజా క్రమాల్లోనూ అమ్మవారిని ఆరాధించారు. మహాలక్ష్మి రూపంలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు అఖండ ఐశ్వర్యం, సకల శుభాలు కలుగుతాయని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు.

ఉదయం సూర్యప్రభ వాహనంపై సావిత్రి మాతగా, సాయంత్రం హంస వాహనంపై బ్రహ్మీమాతగా అమ్మవారిని అలంకరించి ఊరేగించారు. సూర్యప్రభ వాహనంపై సావిత్రి మాతగా దర్శనమిచ్చిన అమ్మవారిని పూజించడం వల్ల ధర్మంపై విశ్వాసం పెరుగుతుంది, హంస వాహనంపై బ్రహ్మీమాతగా దర్శించుకోవడం వల్ల మేధాశక్తి, మంచి చెడులను గుర్తించే విచక్షణ కలుగుతాయని ప్రధానార్చకులు వివరించారు.

ఈ రోజు పూజా కార్యక్రమాలకు గంద్ర భూపాల్ రెడ్డి-రూపా దంపతులు, గంద్ర అభిలాష్ రెడ్డి-దివ్య దంపతులు, గంద్ర సాయికృష్ణారెడ్డి-భావనాంజలి దంపతులు, అనసూరి శ్రీనివాస్-బాలజనని దంపతులు, అట్టం శంతన్ పటేల్-శ్రీగంధ దంపతులు, ముప్పిడి సుధీర్ రెడ్డి-అర్పిత దంపతులు తదితరులు ఉభయదాతలుగా వ్యవహరించారు. పూజల అనంతరం వారికి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత పర్యవేక్షించారు. శ్రీ భద్రకాళీ సేవా సమితి కన్వీనర్ అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న పీఠాధిపతి

తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి బుధవారం భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన స్వామివారికి కార్యనిర్వహణాధికారి రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ మహామండపంలో భక్తులను ఉద్దేశించి స్వామివారు అనుగ్రహ భాషణం చేశారు. ఆలయంలో నిర్మిస్తున్న నూతన రథాన్ని కూడా పరిశీలించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వండి

- **కేసీ వేణుగోపాల్‌కు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ వినతి**
- **పార్టీ సేవలకు గుర్తింపు లభిస్తుందని ఆశాభావం**



అక్షరశక్తి, వరంగల్, అక్టోబరు 14: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి సచిన్ సావంత్‌లను కలిసి విజ్ఞప్తి చేశారు. విద్యార్థి దశలో ఎన్ఎస్‌యూఐ నుంచి ప్రారంభమైన తన రాజకీయ ప్రస్థానం, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేసిన సేవలు, రాజకీయ అనుభవానికి సంబంధించిన వివరాలతో కూడిన బయోడేటాను కేసీ వేణుగోపాల్‌కు అందజేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం లభిస్తే పేదలకు మరింత విస్తృతంగా సేవలందిస్తానని రామకృష్ణ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన నాయకుల సేవలను నాయకత్వం గుర్తిస్తుందన్న నమ్మకం ఉందని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతోపాటు వివిధ ప్రజాసంఘాల సమస్యలపై పనిచేస్తూ, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న తన సేవలను పరిగణనలోకి తీసుకుని ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పదవులు బాధ్యతతో కూడుకున్నవని, అవకాశం లభిస్తే ప్రజాసేవను మరింత విస్తృతం చేయవచ్చని రామకృష్ణ పేర్కొన్నారు. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పనిచేసే నాయకులకు సముచిత ప్రాధాన్యం కల్పించడం ద్వారా కాంగ్రెస్ మరింత బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవిపై పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

బీసీ, ఈబీసీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం మరో అవకాశం

అక్షరశక్తి, హైదరాబాద్, అక్టోబర్ 14: రాష్ట్రంలో బీసీ, ఈబీసీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా ఫూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించింది. అక్టోబర్ 15 నుంచి అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. 2026 ఫాల్ సెషన్‌లో విదేశాల్లో చదవాలనుకునే అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఈ పథకం ద్వారా విదేశాల్లో మాస్టర్స్, డాక్టోరల్ కోర్సుల కోసం విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. ఇందుకోసం దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలలోపు ఉండాలి. దరఖాస్తుదారుల వయస్సు 35 ఏళ్లకు మించకూడదు. గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి. విదేశీ విద్యకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు GREలో 260 లేదా GMATలో 550 స్కోర్ సాధించి ఉండాలి. అలాగే TOEFL 60 లేదా IELTS 6.0 లేదా PTE 50 స్కోర్ కలిగి ఉండాలి. అర్హులైన విద్యార్థులు నిర్దేశిత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులకు అక్టోబర్ 31, 2026 చివరి తేదీగా నిర్ణయించారు.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.